

సమావేశంలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి

దేశాభివృద్ధిలో వీసీల పాత్ర కీలకం

● రాజ్యాంగ పరిరక్షణలో గవర్నర్ పాత్ర భేష్ ● ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో విశ్వవిద్యాలయాల ఉపకులపతులు కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్య అత్యంత అవసరమని ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ అన్నారు. ఊటీ రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం గవర్నర్ ఆర్ఎన్ రవి అధ్యక్షతన జరిగిన విశ్వవిద్యాలయాల ఉపకులపతుల రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని విద్యా సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యవల్లే తాను ఉపరాష్ట్రపతి పదవి పొందగలిగానని చెప్పారు. కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు జరిపిన దాడులు అమానుషమన్నారు. ఉగ్రవాదమే ప్రపంచ దేశాలన్నింటినీ భయపెడుతున్న కీలకమైన సమస్య అని పేర్కొన్నారు. ఇలాంటి దాడుల వల్ల దేశ ప్రగతిని అడ్డుకోలేరని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు ఉపకులపతుల సదస్సును రాష్ట్ర గవర్నర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలను తెలుసుకునేందుకు ఈ రెండు రోజుల సదస్సు దోహదపడుతుందన్నారు. గవర్నర్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి ఆర్ఎన్ రవి తాను చేసిన ప్రమాణానికి కట్టుబడి రాష్ట్రానికి సేవలందిస్తున్నారని అభినందించారు. అన్ని వర్గాలవారికి విద్యాసదుపాయాలు అందించడమే రాష్ట్ర గవర్నర్ ఆశయమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు రాష్ట్ర నేతల నివాళి



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి నాజర్, ఎమ్మెల్యే ఇనిగో ఎస్.ఇరుదయరాజ్

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోమ్ నగరంలో దివంగత పోప్ ఫ్రాన్సిస్ మృతదేహానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు. వాటికన్ సిటీలోని క్యాథలిక్ చర్చి బిషప్‌గా పనిచేసిన పోప్ ఫ్రాన్సిస్ అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా ఈ నెల 21వ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈస్టర్ మరుసటిరోజు పోప్ మృతి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా క్యాథలిక్కులు విచారంలో మునిగిపోయారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం జరుగనుండగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మైనార్టీ సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం నాజర్, ఎమ్మెల్యే ఇనిగో ఎస్.ఇరుదయరాజ్ అంత్యక్రియల్లో పాల్గొంటారని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం వాటికన్ సిటీ చర్చి ప్రాంగణంలో ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ మృతదేహానికి మంత్రి నాజర్, ఎమ్మెల్యే ఇరుదయరాజ్ నివాళులర్పించారు.

త్వరలో మంత్రివర్గంలో మార్పులు?

కోర్టు మొట్టికాయలు తిన్న మంత్రుల వ్యవహారంపై సీఎం స్టాలిన్ దృష్టి



చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో ఇరుక్కుని, న్యాయస్థానాల నుంచి మొట్టికాయలు తిన్న కొంతమంది మంత్రులను పక్కనబెట్టాలని ముఖ్యమంత్రి స్టాలిన్ భావిస్తున్నారా?.. మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేపట్టాలని నిర్ణయించారా?.. అవుననే అంటున్నాయి సచివాలయ వర్గాలు. త్వరలో మంత్రుల మార్పుగానీ, లేదా శాఖల మార్పుగానీ వుంటుందని చెబుతున్నాయి. 2021లో అధికారం చేపట్టిన డీఎంకే అధినేత స్టాలిన్.. గతంలో ఇచ్చిన హామీల అమలుకు గట్టిగానే కృషి చేస్తున్నారు. అయితే కొంతమంది మంత్రుల గత చరిత్ర, వారి నోటి దురుసు ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెస్తున్నట్లు సీఎం భావిస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది మంత్రులు న్యాయస్థానాల్లో చిక్కులు ఎదుర్కొంటున్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలోనూ విద్యుత్‌శాఖ మంత్రిగా వ్యవహరించిన మంత్రి సెంథిల్ బాలాజీపై మనీల్యాండరింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కారణంగా కొంతకాలం జైలు జీవితం అనుభవించిన ఆయన.. మంత్రి పదవికి కూడా దూరమవ్వాల్సివచ్చింది. అయితే న్యాయస్థానాల వెసులుబాటుతో సెప్టెంబరు 26న బెయిలు పొందిన రెండు రోజులకే మంత్రి కూడా అయ్యారు. అయితే అదే ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకున్నట్లు కనిపిస్తోంది. బెయిల్‌పై విడుదలైన వెంటనే సెంథిల్ బాలాజీకి మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరమేంటని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.. అమాత్యస్థానం కావాలో, బెయిల్ కావాలో నిర్ణయించుకోవాలని గడువు విధించింది. దీంతో ఆయన న్యాయనిపుణులను సంప్రదిస్తుండగా, ముఖ్యమంత్రి కూడా దీనిపై కాస్త డైలమాలో పడినట్లు కనిపిస్తోంది. మరోవైపు మహిళల పట్ల వివాదాస్పద వ్యాఖ్యలతో ఇరుకున పడిన సీనియర్ మంత్రి పొన్ముడి కూడా న్యాయస్థానం చేత చీవాట్లు తినాల్సివచ్చింది. అదేవిధంగా ఎర్రమట్టి అక్రమ తవ్వకాల కేసులో హైకోర్టులో మొట్టికాయలు తిన్నారు. అయితే సుప్రీంకోర్టు ఇచ్చిన వెసులుబాటుతో మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. అదే విధంగా సీనియర్ మంత్రి దురైమురుగన్, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం తదితరులు సైతం న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు తిన్నారు. మరో ఏడాదిలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈలోగా కోర్టుల్లో ఆయా మంత్రులకు సంబంధించి ఏవైనా తీవ్రమైన తీర్పులు వెలువడితే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం యోచిస్తున్నట్లు తెలిసింది. అందువల్ల ఆయా మంత్రులను దూరంగా పెట్టడం, లేదా శాఖల మార్పు వంటి చర్యలు చేపడితే ఎలా వుంటుందని సీఎం ఆలోచిస్తున్నట్లు సమాచారం.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ రవి

సదస్సుకు వీసీల డుమ్మా!

● 21 ప్రభుత్వ వర్సిటీల వైస్ ఛాన్సలర్ల గైర్హాజరు
● రాష్ట్రంలో పోలీస్ రాజ్యం
● ఎమర్జెన్సీని తలపిస్తున్న పరిస్థితులు
● గవర్నర్ ఆగ్రహం

అడయార్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఊటీ కేంద్రంగా శుక్రవారం నిర్వహించిన విశ్వవిద్యాలయాల ఉప కులపతుల (వీసీ)ల సదస్సుకు 31 ప్రభుత్వ వర్శిటీల వీసీల సహా మొత్తం 32 మంది వీసీలు గైర్హాజరయ్యారు. రెండు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఏడు ప్రైవేటు వర్శిటీలు కలిపి మొత్తం 9 మంది వీసీలు మాత్రమే హాజరయ్యారు. ఊటీ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి వీసీల సదస్సును రెండులరోజు పాటు ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వీసీలను ఆహ్వానించారు. ఈ సదస్సును ఉప రాష్ట్రపతి జగదీష్ ధన్కర్ ప్రారంభిస్తారని ఆహ్వాన పత్రికల్లో ముద్రించారు. అయితే, రాష్ట్రంలోని వర్శిటీలకు వీసీలను నియమించే అధికారం కేవలం ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. అయితే గవర్నర్ మాత్రం వీసీల సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గవర్నర్ నిర్ణయాన్ని రాజకీయ పార్టీలతో పాటు విద్యావేత్తలు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే సదస్సు కాదని రాజ్‌భవన్ వివరణ ఇచ్చింది. దీంతో వీసీలంతా ఈ సదస్సుకు హాజరవుతారని భావించారు. అదేసమయంలో గవర్నర్ కూడా ఈ సదస్సు కోసం చెన్నై నుంచి కోవై, అక్కడ నుంచి ఊటీకి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. గవర్నర్ రాకను స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, నిరసనలు, ఆందోళనలకు దిగారు.

వీసీలు పాల్గొనకుండా అడ్డుకున్నారు : గవర్నర్ రవి

తన అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీలు పాల్గొనకుండా అడ్డుకోవడంపై గవర్నర్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వీసీలను బెదిరించి సదస్సులో పాల్గొనకుండా చేశారని, ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ 'ముఖ్యమంత్రి స్టాలిన్ పోలీస్ పవర్ ఉపయోగించి ముందుగా నిర్ణయించిన సదస్సులో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వర్సిటీల వీసీలను అడ్డుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి వీసీ లందరికీ ఫోన్ చేసి సదస్సులో పాల్గొనవద్దని బెదిరించినా ఫలితం లేకపోవడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ తన పోలీస్ పవర్‌ను ఉపయోగించి వీసీలను కట్టడి చేశారు. ఈ సదస్సు జరిగిన రోజున ఒక వీసీని విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఊటీలో బస చేసిన మిగిలిన వీసీల గదులు అర్ధరాత్రి నుంచి తెరుచుకోలేదు. ఈ సదస్సుకు హాజరైతే తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులతో బెదిరించారు. ఇది పోలీస్ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమే. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం సాగుతుందా? రాష్ట్రంలో జరిగే ఒక విద్యా సదస్సులో వీసీలు పాల్గొనేందుకు విద్యా స్వాతంత్ర్యం లేదా?' అంటూ గవర్నర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

ఆహ్వాన పత్రికల్లో ముద్రించినట్టుగానే ఈ సదస్సును ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభించారు. గవర్నర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు 32 మంది వీసీలు డుమ్మా కొట్టారు ఉపరాష్ట్రపతి ప్రారంభించిన ఈ సదస్సుకు వీసీలు హాజరుకాక పోవడంతో గవర్నర్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్ తీవ్ర నిరుత్సాహం చెందారు.

అక్రమార్జన కేసులో మంత్రి పన్నీర్‌సెల్వంకు ఎదురుదెబ్బ

కింది కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసిన హైకోర్టు



మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులో మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం సహా ముగ్గురిని విడిపిస్తూ కడలూరు న్యాయస్థానం ఇచ్చిన తీర్పును మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. 2006 నుండి 2011వ సంవత్సరం వరకు డీఎంకే ప్రభుత్వ హయాంలో మంత్రిగా వ్యవహరించిన ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఆయన భార్య, కుమారుడిపై ఆదాయానికి మించి అదనంగా రూ.3 కోట్లు కూడబెట్టారని ఏసీబీ కేసు నమోదుచేసింది.. ఈ కేసుపై విచారణ జరిపిన కడలూరు న్యాయస్థానం మంత్రి సహా ముగ్గురిని అక్రమార్జన కేసు నుండి విముక్తి కల్పిస్తూ తీర్పు నిచ్చింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఏసీబీ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. శుక్రవారం న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందు ఈ పిటిషన్ విచారణకు రాగా, ఏసీబీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ కేసు ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగా నేరానికి పాల్పడినట్లు తేలిందని, అయితే దిగువ కోర్టు వీటిని పట్టించుకోలేదని వివరించారు. ఇరుతరపు వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఆయన భార్య, కుమారుడిని విడుదల చేస్తూ కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా ఆరోపణలను రికార్డు చేసి ఆరు నెలల్లోగా విచారణ పూర్తి చేసి నివేదిక దాఖలు చేయాల్సిందిగా సంబంధిత పోలీసులకు ఉత్తర్వులు జారీచేశారు.

మాజీమంత్రి గోకుల ఇందిరకు పతీ వియోగం

● అన్నాడీఎంకే నేతల సంతాపం



గోకుల ఇందిర భర్త చంద్రశేఖర్ భౌతికకాయానికి అంజలి ఘటిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి, సెంగోటయ్యాన్ తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రిసీడియం కార్యదర్శి, మాజీమంత్రి ఎస్.గోకుల ఇందిర భర్త ఏఆర్ చంద్రశేఖర్ అనారోగ్యంగా కారణంగా మృతిచెందారు. అన్నానగర్ నివాసంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి శుక్రవారం ఉదయం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అంజలి ఘటించారు. అనంతరం గోకుల ఇందిరను పరామర్శించి ఆమెకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా అన్నాడీఎంకే నేతలు కేపీ మునిస్వామి, కేఏ సెంగోట్టయ్యాన్, సి.విజయ్‌భాస్కర్, నత్తం విశ్వనాథన్ తదితరులు కూడా చంద్రశేఖర్ భౌతికకాయానికి అంజలి ఘటించారు.

గ్యాంగ్‌మన్ అప్రమత్తం.. తప్పిన ప్రమాదం

● తిరువళ్లూరు వద్ద రైలు పట్టాలపై బోల్టులు తొలగించిన దుండగులు

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపం తిరువలంగాడు రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై బోల్ట్ నట్టులను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఆ మార్గంలో వెళ్లే రైళ్లను కూల్చేందుకు దుండగులు ఈ చర్యలకు పాల్పడి ఉంటారని రైల్వే భద్రతా విభాగం అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న రైల్వే గ్యాంగ్‌మన్ పట్టాల బోల్టులు తొలగించి ఉండటం గమనించి వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు 'నాన్సీ' అనే జాగిలంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తిరువలంగాడు రైల్వేస్టేషన్ సమీపం హరిశ్చంద్రపురం ప్రాంతంలో చెన్నై మార్గంలో రైలు పట్టాలను కలిపి జంక్షన్ వద్ద బోల్ట్,నట్‌లు తొలగించి ఉండటం గమనించి అధికారులు సిగ్నల్స్ ఆఫ్ చేశారు. వెంటనే కొత్త బోల్టులు బిగించి, ఆ మార్గంలో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

కశ్మీర్ నుంచి చెన్నైకి మరో 48 మంది

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు కాల్పులు జరిపిన నేపథ్యంలో ఆ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్ళిన మరో 48 మంది తమ పర్యటన ముగించుకుని తిరిగొచ్చారు. ఉగ్రవాదుల దాడులు జరిగిన వెంటనే ఢిల్లీలోని తమిళనాడు హౌస్‌లోని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎంపీ తిరుచ్చి శివా తదితరులు కశ్మీర్ విహారయాత్రకు వెళ్ళిన తమిళుల వివరాలను సేకరించి, వారందరినీ ఆగమేఘాలపై ఢిల్లీ తీసుకొచ్చారు. తమిళనాడు హౌస్‌లో వీరందరికి బస కల్పించారు. అనంతరం రైళ్లు, విమానాల్లో వారిని స్వస్థలాలకు పంపారు. ఆ ప్రకారం మూడు రోజుల క్రితం ఢిల్లీ నుండి తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన 48 మంది తమిళులు శుక్రవారం ఉదయం 6.30 గంటలకు చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వీరి కోసం కుటుంబీకులు, బంధువులు స్టేషన్‌కు వచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వ అధికారులు ఢిల్లీ నుండి వచ్చినవారందరికీ అల్పాహారం అందజేసి వారి వారి స్వస్థలాలకు వెళ్లేందుకు వాహన సదుపాయం కల్పించారు.

విహారయాత్రలో విషాదం

● ఆళియారు వాగులో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి



విద్యార్థులు మృతి చెందటంతో శోకతప్తులైన సహచరులు

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఆళియా వాగులో మునిగి చెన్నైకి చెందిన ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. వివరాలిలా వున్నాయి... పూందమల్లి ప్రైవేటు కళాశాలలో ఫిజియోథెరపీ కోర్సు చదువుతున్న 25 మంది విద్యార్థులు ఆలియారు వాగుకు విహారయాత్రగా వెళ్ళారు. విద్యార్థులందరూ ఆ వాగులో దిగి స్నానం చేస్తుండగా తరుణ్, రేవంత్, ఆంటో జెనీఫ్ అనే ముగ్గురు ఉన్నట్టుండి వాగులో కొట్టుకుపోయారు. తోటి విద్యార్థులందరూ వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ వాగు ప్రవాహంలో ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. చివరకు ఆలియారు పోలీసులు, అగ్నిమాపక దళం గంటసేపు గాలించిన మీదట ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. తమతో పాటు వచ్చిన ముగ్గురు విద్యార్థులు నీట మునిగి ప్రాణాలు కోల్పోవడటంతో కళాశాల విద్యార్థులంతా శోకతప్తులై విహారయాత్రను అర్ధాంతరంగా రద్దు చేసుకుని స్వస్థలానికి బయలుదేరారు.

సమాచార దర్శిని

హజ్ యాత్రికులకు వైద్యపరీక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే భక్తులకు వైద్య పరీక్షలు, టీకాలు వేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఏడాది రాష్ట్రం నుంచి 5,657 మంది సహా దేశవ్యాప్తంగా 1,75,025 మంది హజ్ యాత్రకు వెళుతున్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి ఓఎంఎంవీ టీకా 8,025 డోస్‌లు, ఎస్ఐవీ 1,452 డోస్‌లను కేంద్ర ప్రభుత్వం అందించింది. తమిళనాడు హజ్ కమిటీ సిఫారసు మేరకు 37 జిల్లాలు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో 41 ప్రాంతాల్లో హజ్‌కు వెళ్లే భక్తులకు వైద్య పరీక్షలు, టీకాలు వేయనున్నారు. గురువారం నుంచి ప్రారంభమైన కార్యక్రమం మే 5వ తేది వరకు కొనసాగుతోందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ శిబిరాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ తెలిపింది.

గ్రూప్-4 పరీక్షల నోటిఫికేషన్

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 3,935 గ్రూప్-4 పోస్టుల భర్తీకి జూన్ 12వ తేది రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... ఇతర గ్రూప్-4 పోస్టుల భర్తీకి జూన్ 12వ తేది ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శుక్రవారం నుంచి మే 24వ తేది వరకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస విద్యార్హత 10వ తరగతిగా ఉంది.

సహకార శాఖ దుకాణాల్లో రూ.2వేల కోట్ల విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 45 హోల్‌సేల్ దుకాణాలు, 320 ప్రాథమిక సహకార దుకాణాలున్నాయి. వీటిలో సూపర్ మార్కెట్లు, ఫార్మసీలు, కూరగాయల దుకాణాలు, పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ దుకాణాలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో, సహకార శాఖ దుకాణాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,196 కోట్ల విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

మహిళా సాధికార పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

● సీఎం స్టాలిన్ వెల్లడి

అడయార్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కలైంజర్ మహిళా సాధికార పథానికి అర్హులైన వారి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల ప్రాంతాల్లో దరఖాస్తులను స్వీకరిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నగదు పథకానికి నాలుగో దశలో రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తామని, దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హులైన మహిళలకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

● నెం.07191 కాచిగూడ-మదురై ప్రత్యేక రైలు మే 12 నుంచి జూన్ 4వ తేది వరకు (సోమవారం), మరుమార్గంలో నెం.07192 మదురై-కాచిగూడ ప్రత్యేక రైలు మే 14 నుంచి జూన్ 4వ తేది వరకు (బుధవారం) పొడిగించారు.

● నెం.7695 సికింద్రాబాద్-రామేశ్వరం ప్రత్యేక రైలు మే 7 నుంచి 28వ తేది వరకు (బుధవారం), మరుమార్గంలో నెం.07696 రామేశ్వరం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు మే 9 నుంచి 30వ తేది వరకు (శుక్రవారం) నాలుగు సర్వీసుల చొప్పున పొడిగించారు.

● నెం.07153 నరసాపురం - బెంగళూరు ప్రత్యేక రైలు మే 9 నుంచి జూన్ 27వ తేది వరకు (శుక్రవారం), నెం.07154 ఎస్ఎంవీటీ బెంగళూరు-నరసాపురం ప్రత్యేక రైలు మే 10 నుంచి జూన్ 28వ తేది వరకు (శనివారం) తలా 8 సర్వీసులుగా పొడిగించారు.

కో-ఆప్‌టెక్స్‌లో 80 శాతం రాయితీ

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కో-ఆప్‌టెక్స్ సంస్థ, నాలుగు విక్రయ కేంద్రాల్లో మాత్రమే 40 నుంచి 80 శాతం ప్రత్యేక రాయితీ అందించనుంది. ఏడాదికి పైగా స్టాక్‌లో ఉన్న అన్నిరకాల దుస్తులు రాయితీ ధరకు విక్రయించనున్నారు. ఎగ్మూర్‌లోని టీవీపీఎం విక్రయ కేంద్రం, కోవై మరుదం విక్రయ కేంద్రం, తిరునల్వేలి పోరునై. గాంధీమతి తదితర నాలుగు విక్రయ కేంద్రాల్లో ఈ రాయితీ అందుబాటులో ఉంటుంది. స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే ఈ తగ్గింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్లస్ వన్ కంప్యూటర్ సైన్స్ పరీక్షకు రెండు గ్రేస్ మార్కులు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్ కంప్యూటర్ సైన్స్‌లో 24వ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాసినా రెండు గ్రేస్ మార్కులు ప్రకటించారు. ప్రశ్నగా తప్పు ఉన్నందున ఏ సమాధానం రాసినా గ్రేస్ మార్కులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ ప్రకటనలో తెలిపింది.

జూన్ 12న మేట్టూరు జలాల విడుదల

● మంత్రి దురైమురుగన్

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యామ్ నుండి జూన్ 12న సాగునీటిని విడుదల చేయనున్నట్లు నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రకటించారు. ఈ మేరకు శాసనసభలో ఓ ప్రకటన చేస్తూ ఈసారి ఆయకట్టు చివరి ఆయకట్టుకు కూడా సాగునీరందేలా రూ.98 కోట్లతో సాగునీటి కాల్వల పూడిక తీత పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని, మే నెలాఖరులోగా ఈ పనులన్నీ పూర్తవుతాయని చెప్పారు. జూన్ 12న ఎప్పటి లాగే ముఖ్యమంత్రి స్టాలిన్ మేట్టూరు జలాలను విడుదల చేస్తారని ఆయన చెప్పారు.

ఈపీఎస్ ఇంటికి బాంబు బెదిరింపు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ఇంటిని బాంబులతో పేల్చివేస్తామంటూ వచ్చిన ఈ-మెయిల్ కలకలం రేపింది. గ్రీన్‌వేస్ రోడ్డులోని ఈపీఎస్ ఇంటికి సమీర్ అనే పేరుతో శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన ఈ-మెయిల్‌లో, ఆర్‌డీఎక్ బాంబు ఉంచినట్లు ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో అక్కడకు చేరుకుని ఇళ్లు, పరిసరాలు పరిశీలించి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. అలాగే, ఈ-మెయిల్ పంపిన వ్యక్తి చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు.

రూ.4.98 లక్షలకు కొండ రైలు అద్దెకు


కొండ రైలు స్టేషన్‌లో విద్యార్థులు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీకి వచ్చే ప్రయాణికులు కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాగే, కున్నూరు-ఊటీ, మేట్టుపాళయం మధ్య నడుపుతున్న కొండ రైలును విదేశీ పర్యాటకుల అద్దెకు తీసుకుని ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో, కోవైలోని నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రవ్యాప్తంగా పలు కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో సుమారు 90 మంది విద్యార్థినీ, విద్యార్థులు గెలుపొందారు. వారికి బహుమతిగా కొండ రైలులో ప్రయాణం చేయించారు. అందుకోసం ఆ సంస్థ నిర్వాహకులు రూ.4.98 లక్షలతో కొండ రైలు అద్దెకు తీసుకున్నారు. గురువారం జరిగిన ఈ రైలు ప్రయాణంతో విద్యార్థులు ఆనందోత్సహాల్లో మునిగిపోయారు.

● స్థానిక సంస్థల్లో అనర్హత వ్యవహారం...

తొలగించిన పదవులకు ఎన్నికలు నిర్వహించం

● హైకోర్టుకు వివరించిన రాష్ట్రప్రభుత్వం

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో అనర్హత వేటు పడిన కౌన్సిలర్, ఛైర్మెన్ పదవులకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే ఆలోచన లేదని మద్రాస్ హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం వివరణ ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ ఛైర్మెన్లలో కొంద మంది తమ అధికారాన్ని దుష్ప్రయోగం చేశారనే కారణంతో ప్రభుత్వం వారిని అనర్హులుగా ప్రకటించింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 159వ వార్డు కార్పొరేటర్ బాబు, 5వ వార్డు కార్పొరేటర్ చొక్కలింగం, తాంబరం కార్పొరేషన్ 40వ వార్డు కార్పొరేటర్, జోన్ ఛైర్మెన్ జయ ప్రదీప్, ఉసిలంపట్టి మున్సిపల్ ఛైర్మెన్, 11వ కౌన్సిలర్ శకుంతలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ గత మార్చి 27న పదవులనుండి తొలగించింది. ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఆ నలుగురు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. న్యాయమూర్తి జె.సత్యనారాయణ ప్రసాద్ ముందు ఈ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది.పదవిలోవుంటూ అధికార దుష్ప్రయోగానికి పాల్పడ్డారని కారణంతో నలుగురు ప్రజాప్రతినిధులను పదవినుండి తొలగించడం చట్టానికి విరుద్ధమని, చర్యలు తీసుకునే ముందు వారి వివరణ కోరలేదని అందువల్ల, పదవీతొలగింపు ఉత్తర్వులకు స్టే విధించి రద్దు చేయాలని పిటిషనర్ల తరుపు న్యాయవాదులు కోరారు. దీనిపై జోక్యం కలుగజేసుకున్న ప్రభుత్వం తరుపు న్యాయవాది సురేష్‌కుమార్, ఈ కేసుల తీర్పు విడుదలయ్యేవరకు ఆ నాలుగు పదవులకు ఎన్నికలు నిర్వహించమని తెలిపారు. దీనిని రికార్డు చేసుకున్న న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణ వచ్చే జూన్ 9వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కలాం పేరిట స్కాలర్‌షిప్‌లు లేవు

ఆ ప్రకటనలు అవాస్తవం ● స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం స్కాలర్ షిప్ అందజేయనున్నట్లు వస్తున్న ప్రకటనలు నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనలో... అబ్దుల్ కలాం పేరుతో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 75శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,000, 85 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్లస్ టూ విద్యార్థులకు రూ.25,000 స్కాలర్ షిప్ అందజేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఉంది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... సామాజికమాధ్యమాల్లో స్కాలర్ షిప్ పేరుతో వస్తున్న ప్రకటనలు పూర్తిగా అవాస్తమని, అలాంటివి కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించలేదని, ఈ ప్రకటనలు నమ్మి మోసపోరాదని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది.

వేలాంకన్ని ఆలయం తరపున పోప్‌కు నివాళి


మౌన ర్యాలీలో క్రైస్తవులు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం సమీపం వేలాంకన్ని ఆరోగ్య మాత ఆలయం తరపున దివంగత పోప్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బిషప్ అర్పుతరాజ్ నేతృత్వంలో బిషప్‌లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దయానా షర్మిలా, డిప్యూటీ ఛైర్మన్ థామస్ ఆల్వా ఎడిసిన్, వందలాది మంది భక్తులు కొవ్వొత్తులతో ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో మౌన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వీఆర్‌కు ఉళుందూర్‌పేట డీఎస్పీ

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట డీఎస్పీ ప్రదీప్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఉళుందూర్‌పేట డీఎస్పీ ప్రదీప్ మాట్లాడినట్లు ఆడియో ఒకటి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. అందులో... పుదుకోటలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ముఠాల నుంచి లారీకి రూ.5వేలు వసూలుచేయాలంటూ డీఎస్పీ మాట్లాడినట్లుగా వచ్చిన ఆడియోపై స్పందించిన ఐజీ చర్యలు తీసుకుని, డీఎస్పీకి వీఆర్‌కు పంపించారు.


గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలని కోరుతూ నుంగంబాక్కంలోని శాస్త్రిభవన్ సమీపంలో శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, జాతీయ కార్యవర్గ సభ్యులు వాసుకి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా

వర్షాల కోసం ప్రత్యేక పూజలు


నీళ్ల అండాలో కూర్చొని వరుణజపం చేస్తున్న పూజారులు

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పూర్ జిల్లా దక్షిణ అవినాశి పంచాయతీ సెమ్మాండ గౌండన్‌పుదూర్ గ్రామంలోని మహాకాళియమ్మ, సెల్వ వినాయకుడు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు నీటితో నింపిన పెద్ద అండాలో కూర్చొని వరుణ జపాలు చేశారు.

4 వరకు ట్రాఫిక్ మార్పులు పొడిగింపు

అడయార్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట నుంచి సైదాపేట వరకు ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ట్రాఫిక్ మార్పులను మే 4 తేదీ వరకు పొడగించినట్టు చెన్నై నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ ట్రాఫిక్ మార్పుల్లో భాగంగా, తేనాంపేట నుంచి సైదాపేట వెళ్ళే వాహనాలన్నీ సెనెటాఫ్, టర్న్‌బుల్స్ రోడ్డు జంక్షన్‌కు వెళ్ళి అక్కడ నుంచి కుడివైపు తిరిగి పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ మార్గంలో సైదాపేట చేరుకోవచ్చు. తేనాంపేట నుంచి గాంధీ మండపం, అడయారు చేరుకునే వాహనదారులు సైగాపేట వెళ్ళకుండా జీకే మూపనార్ వంతెన, కోట్టూరుపురం మీదుగా గాంధీ మండపం, అడయారుకు చేరుకోవచ్చు. తేనాంపేట సిగ్నెల్ నుంచి సైదాపేటవరకు అన్నాసాలైలో రహదారి నిర్మాణ పనులు సాగుతున్నందున ఈ ట్రాఫిక్ మార్పులు చేయడం జరిగిందని తెలిపింది.

డీఎంకే అవినీతిని ఎండగట్టండి

● బూత్‌కమిటీ ఇన్‌ఛార్జీలకు ఈపీఎస్ పిలుపు

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అన్నారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జరిగిన పార్టీ బూత్‌కమిటీ ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బూత్‌కమిటీ ఇన్‌ఛార్జులు రాష్ట్రమంతటా ఎన్నికల ప్రచారాన్ని వెంటనే ప్రచారం చేయాలని, డీఎంకే ప్రభుత్వం గత నాలుగేళ్లకు పైగా జరిపిన అవినీతి అక్రమాలపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలన్నారు.

మసీదు నిర్వహణపై సభ్యుల ఫిర్యాదు

● రూ.20 లక్షల మేర మోసం జరిగిందని ఆరోపణ



తిరుత్తణి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ లోని మసీదు కమిటీ నిర్వాహణలో లోపాలున్నాయని కమిటీ సభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే తిరుత్తణిలోని డాక్టర్ రాధాకృష్ణవీధిలో 20 ఏళ్ళుగా మక్కా మసీదు నిర్వాహణ జరుగుతుంది. మసీదు ప్రారంభించిన మూడేళ్ల తర్వాత కొత్త కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నించినా అప్పటి కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సుల్తాన్ అడ్డుకున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మసీదు నిర్వాహణలో లోపాలున్నాయని, గడిచిన ఈ 20 ఏళ్ళలో రూ.20 లక్షల మేరకు అవినీతి జరిగిందని అదే కమిటీ సభ్యులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదన్నారు. దీనిపై గురువారం ఉదయం తిరుత్తణి డీఎస్పీ కార్యాలయానికి వెళ్ళి అధ్యక్షుడి సహ పలువురిపై డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం సభ్యుడు నిజాం మాట్లాడుతూ, గత 20ఏళ్ళుగా మసీదు పాలనా బాధ్యతలను ఒకే కార్యవర్గం నడిపిస్తోందని, దీనిని వ్యతిరేకిస్తూ తాము శనివారం నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించనున్నామని దీనికి పోలీసుల భద్రతా ఏర్పాట్లు చేయాలని డీఎస్పీని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ వాహబ్, సహబీన్, నజీర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రముఖుడు ఆదికేశవరావు మృతి


ఆదికేశవరావు (ఫైల్ ఫొటో)

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'రాయల కళా సమితి' వ్యవస్థాపకులు, తెలుగు ప్రముఖులు పి.ఆదికేశవరావు (75) అనారోగ్యం కారణంగా మృతిచెందారు. కొళత్తూరులోని ఆయన నివాసంలో రాత్రి 9 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆదికేశవరావుకు భార్య పద్మలత, కుమార్తెలు సబితా లక్ష్మీ, పూర్ణిమ ఉన్నారు. ఆల్ ఇండియా రేడియోలో పే అండ్ అకౌంట్స్ విభాగంలో సీనియర్ క్లర్క్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన తర్వాత ఆదికేశవరావు తెలుగు భాషాభివృద్ధికి తనవంతు కృషిచేశారు. ఆయన స్థాపించిన రాయల కళాసమితి ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించి, తెలుగు కవులు, రచయితలు, భాషాపోషకులను ఘనంగా సత్కరించారు. గత మార్చిలో కొళత్తూర్‌లో ఉన్న ప్రశాంత్ ఆస్పత్రిలో నడుముకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతికి పెరంబూరు తెలుగు సాహితీ సమితి తరపున టీఆర్ ఎస్ శర్మ, పీఆర్ కేశవులతో పాటు పలువురు తెలుగు ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదికేశవరావు మృతదేహానికి శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విమానాశ్రయం నుంచి ఎంటీసీ బస్సు సర్వీసులు ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి తొలి మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లాలంటే సుమారు కి.మీ దూరం వెళ్లాల్సి ఉంటోంది. ప్రయాణికుల సౌకర్యార్థం విమానాశ్రయం నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు ఎంటీసీ బస్సులు నడుపుతామని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రకటించారు. ఆ ప్రకారం, విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం, అక్కరై, ఈసీఆర్ రోడ్డు ప్రాంతాలకు తొలి బస్సు సేవలను మంత్రులు శివశంకర్, టీఎం అన్బరసన్‌లు ప్రారంభించారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ ప్రాంతంలో 11ఏళ్ళ బాలికపై అత్యాచారానికి పాల్పడి పోక్సో చట్టం కింద అరెస్టయిన యువకుడికి న్యాయస్థానం యావజ్జీవ జైలుశిక్ష విధించింది. 2024వ సంవత్సరంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నేరానికి సిరిమలై పుదూర్‌కు చెందిన థామస్ పెర్నాండో (28)ను పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తికావడంతో దిండుగల్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ జైలుశిక్ష, రూ.1.12లక్షల జరిమానా విధిస్తూ తీర్పువెలువరించారు. ఇదిలా వుండగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు దిండుగల్ జిల్లాలో 19 పోక్సో కేసులకు న్యాయస్థానం తీర్పువెలువరించడం గమనార్హం.

జిప్మర్ ఆస్పత్రికి బాంబు బెదిరింపు


పోలీసు జాగిలాలతో తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్

పుదుచ్చేరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని జిప్మర్ ఆస్పత్రికి రెండోసారి అజ్ఞాత వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై అందిన సమాచారంతో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ శుక్రవారం ఉదయం జిప్మర్ ఆస్పత్రికి చేరుకున్నారు. వెంటనే విధుల్లో ఉన్న వైద్యసిబ్బంది, రోగులను బయటికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఆ తర్వాత ఆస్పత్రి భవనంలోని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు వదంతులు మాత్రమేనని నిర్ధారించారు. పుదుచ్చేరి ప్రభుత్వ నిర్వాహణలో వున్న జిప్మర్ ఆస్పత్రికి ఈ నెలలో బాంబు బెదింపు రెండోసారి కావడంతో ప్రజలు భయాందోళనలకు గురైయ్యారు.

కొండజాతి మేకల గణనలో విషాదం

● గుండెపోటుతో రేంజర్ మృతి


ఫారెస్ట్ రేంజర్ మణికంఠన్ (ఫైల్‌ఫొటో)

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా గూడలూరు అటవీ ప్రాంతంలో కొండజాతి మేకల లెక్కింపు కార్యక్రమాల్లో పాల్గొన్న ఫారెస్ట్ రేంజర్ గుండెపోటుతో మరణించారు. గూడలూరు తదితర ప్రాంతంలోని కొండగుహలు, పచ్చికబయళ్లు, పొదల్లో ఉన్న అడవి జాతి మేకల గణనను అటవీశాఖ అధికారులు ఇటీవల ప్రారంభించారు. అటవీ శాఖ సిబ్బంది తోపాటు ఫారెస్ట్ రేజర్ మణికంఠన్ కూడా మేకల లెక్కింపు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. గురువారం సాయంత్రం మేకల లెక్కింపులో పాల్గొన్న మణికంఠన్‌కు ఉన్నట్టుండి గుండెనొప్పి రావటంతో సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే సహోద్యోగులు ఆయనకు ప్రాథమిక చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. క్షణాలలో తుది శ్వాస విడిచారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లైంగిక వేధింపుల ఫిర్యాదు

● బాధితురాలిపై కత్తితో దాడి

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో బాలికపై ఓ యువకుడు కత్తితో దాడిచేసిన ఘటన కలకలం రేపింది. స్థానిక కొరుక్కుపేటకు చెందిన మదన్‌కుమార్ ఈ నెల 16న 16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి మదన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, తమ్ముడిపై ఫిర్యాదు చేసిందనే ఆగ్రహంతో అతడి సోదరుడు బాబు శుక్రవారం ఉదయం బాధితురాలిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి బాలిక కింద పడిపోవడంతో, బాబు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు గాయాలతో ఉన్న బాలికను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పరారైన బాబు కోసం గాలిస్తున్నారు.

తల్లిదండ్రులపై దాడి

● డీఎంకే కార్యకర్త దుశ్చర్య


గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తల్లి నిర్మల

తిరుత్తణి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై కుమారుడు దాడి చేసి ఆస్పత్రి పాలు చేశాడు. వివరాల్లోకి వెళ్తే తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని అక్కయ్యరోడ్డులో టైలరింగ్ దుకాణం నడిపుకుంటూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసన్ (65), నిర్మల (60) దంపతులను వారి కుమారుడు, డీఎంకే కార్యకర్త సురేష్ ఇళ్ల తన పేరుమీద రాయాలని నిత్యం చిత్రహింసలు పెట్టేవాడని సమాచారం. సురేష్ భార్య డీఎంకే కౌన్సిలర్ కావడం గమనార్హం. దీంతో పలుమార్లు తమ కుమారుడు మాపై దాడికి పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేసినా పోలీసులు సర్దిచెప్పి పంపించేసేవారని ఆ వృద్ధ దంపతులు తెలిపారు. ఇదిలా వుండగా, గురువారం సాయంత్రం ఇళ్ల తనపేరుమీద ఎప్పుడు రాస్తారని సురేష్. నిలదీసినట్టు తెలిసింది. వృద్ధాప్యంలో ఇళ్లు రాసిస్తే మేము ఎక్కడ వుండాలని తండ్రి బదులివ్వగా కోపంతో తల్లిదండ్రులను కర్రతో కొట్టి, ఇంట్లోని సామాన్లను ధ్వంసం చేసి వెళ్లిపోయాడు. ఈ దాడిలో తల్లి నిర్మలకు తలకు గాయమై తీవ్రరక్త స్రావం కావడంతో చుట్టుపక్కల వారు ఆమెను అస్పత్రిలో చేర్చారు. తమను కాపాడాలని ఆ వృద్ధదంపతులు అధికారులను వేడుకుంటున్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి తలా 12 ఏళ్ల జైలు శిక్ష

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమంగా తరలించిన కేసులో ముగ్గురికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మదురైలో కీరత్తురై పోలీసు స్టేషన్ పరిధిలోని కరువేలంగాడు ప్రాంతంలో గంజాయి దాచారనే సమాచారంతో పోలీసులు గత నెలలో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పాండ్యరాజన్, జాకి (అలియాస్) ప్రశాంత్ ఆంటోని, శరణ్యలను అరెస్ట్ చేశారు. ఈ కేసు జిల్లా మొదటి అదనపు మాదక ద్రవ్యాల అక్రమణా రవాణా కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. విచారణ ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ రుజువు కావడంతో ముగ్గురికి తలా 12 ఏళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన


కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రమేష్‌బాబు తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి502ఎ ఆధీనంలోని వాసవీ క్లబ్ టూస్టార్ కేసీజీఎఫ్ ఎలైట్ చెన్నై-వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కొడంబాక్కంలో గురువారం రాత్రి క్లబ్‌ల అధ్యక్షులు డాక్టర్ ఎస్.రమేషబాబు, టి.జ్యోష్న శ్రీనివాసరావు సారథ్యం వహించిన ఈ ప్రదర్శనలో కార్యదర్శులు మన్నారు ఉదయ్‌కుమార్, విశాలక్ష్మీ ఉదయ్‌కుమార్, ట్రెజరర్ గీతా ప్రసాద్, జ్యోతి ప్రసాద్ వొమ్మిన, టీవీ సుబ్బారావు, మాజేటి జగదీష్‌బాబు, టి.నరసింహారావు, టి.లక్ష్మీరావు, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు మాట్లాడుతూ, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని యావత్ భారత సమాజం ఖండిస్తోందని, తమ క్లబ్‌ల తరుపున మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

నీలగిరి జిల్లా ఊటీలో శుక్రవారం జరిగిన వీసీల సమావేశంలో పాల్గొన్న గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా నల్ల జెండాలతో స్వాగతం పలికేందుకు యత్నించిన కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



వివాహేతర సంబంధానికి అడ్డమైందనీ..!

ప్రియులతో కలిసి తల్లి దారుణం ● మద్యం తాగించి పడుకోబెట్టే యత్నం ● బాలిక మృతి


చిన్నారి దర్శిని (ఫైల్‌ఫొటో)

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమ వివాహేతర సంబంధానికి అడ్డం వస్తోందని ఆగ్రహించిన ఓ తల్లి, ఆమె ముగ్గురు ప్రియులు రెండున్నరేళ్ల బాలికపై దాడిచేశారు. అంతటితో ఆగకుండా చిన్నారికి మద్యం తాగించి పడుకోబెట్టేందుకు యత్నించారు. దెబ్బలకు తాళలేక ఆ చిన్నారి మృతి చెందింది. తిరునల్వేలి జిల్లాలో జరిగిన ఈ ఘోరానికి సంబంధించిన వివరాలిలా వున్నాయి... దిసైవిసై ద్వారంబట్టు ప్రాంతంలో శరత్, బృంద (25) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరు నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరికి దర్శిని (2) అనే కుమార్తె ఉంది. శరత్ కోవైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బృంద కొంతమంది యువకులతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో గత బుధవారం రాత్రి లింగసెల్వం, ముత్తుచుడర్, బెంజమిన్ అనే ముగ్గురు యువకులు బృందాను, ఆమె కుమార్తె దర్శినిని వాళతొట్టమ్ అనే ప్రాంతానికి తీసుకెళ్ళారు. ఆ తర్వాత దర్శినిని రోడ్డు పక్కనే కూర్చోబెట్టి బృందాతో గడిపేందుకు వెళ్లారు. ఆ సమయంలో చిన్నారి ఏడుస్తుండడంతో. తమకు అంతరాయం కలిగిస్తుందని ఆగ్రహించిన ముగ్గురు యువకులు, బృంద కలిసి ఆ చిన్నారి చేత బలవంతంగా మద్యం తాగించగా, కొద్దిసేపటికే ఆ చిన్నారి ప్రాణాలు విడిచింది. ఇంత జరిగినా ఏ మాత్రం దిగులు చెందని బృంద మరుసటి రోజు తన కుమార్తె అనారోగ్యంతో మృతి చెందినట్లు నాటకమాడింది. భర్త, కుటుంబీకులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బృందాను, ఆమె సన్నిహితులను తమదైన శైలిలో విచారించడంతో అసలు గుట్టురట్టయ్యింది. దీంతో ఆ నలుగురినీ పోలీసులు అరెస్టు చేశారు.



బహూకరించిన కారు వద్ద ఎస్ఏసీ దంపతులు

52వ వివాహ వార్షికోత్సవం... భార్యకు కారు బహుమతిచ్చిన ఎస్ఏసీ

అగ్రహీరో విజయ్ తండ్రి, సీనియర్ సినీ దర్శకుడు ఎస్.ఎ.చంద్రశేఖర్ (ఎస్ఏసీ), శోభన దంపతులు తమ 52వ వివాహ వార్షికోవత్సవాన్ని తాజాగా జరుపుకున్నారు. దీనిని పురస్కరించుకుని తన భార్యకు దర్శకుడు ఎస్ఏసీ అరుదైన బహుమతి ప్రదానం చేశారు. రూ.కోట్లు విలువ బీఎండబ్ల్యూ బెంజ్ కారు గిఫ్ట్‌గా బహూకరించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'మాకు వివాహమై 52 యేళ్ళు పూర్తయ్యాయి. ఈ ప్రయాణంలో నా ద్వారా అనేక సమస్యలు, వేధింపులు, కష్టాలు ఆమెకు వచ్చాయి. వీటన్నింటినీ భరిస్తూ నాతోనే కలిసి ప్రయాణం చేసింది. అదీ కూడా ఎంతో సంతోషంగా నాతో కలిసి నడిచింది. వీటిని తలచుకుంటే ఎంతో గర్వంగా ఉంది. 52 యేళ్ళుగా నాతోపాటు జీవన ప్రయాణం సాగిస్తున్న నా భార్యకు బీఎండబ్ల్యూ కారును ఈ శుభ సందర్భంలో బహుమతిగా అందజేస్తున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, తన పెళ్ళి నాటి పాత ఫొటోను ఎస్ఏసీ విడుదల చేశారు.




'నిళర్‌కుడై' ఆడియో రిలీజ్ దృశ్యం

థియేటర్లన్నీ రెస్టారెంట్లుగా మారిపోతున్నాయ్

● ఆర్‌కే సెల్వమణి

సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ నానాటికీ తగ్గిపోతుందని ఈ కారణంగా థియేటర్లన్నీ మినీ రెస్టారెంట్లుగా మారిపోతున్నాయని ప్రముఖ దర్శకుడు, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి ఆవేదన వ్యక్తం చేశారు. దర్శన్ ఫిలిమ్స్ పతాకంపై జ్యోతి శివ నిర్మాణ సారథ్యంలో రూపొందిన చిత్రం 'నిళర్‌కుడై'. సీనియర్ దర్శకుడు కేఎస్ ఉదయ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన శివ ఆర్ముగం ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించారు. సీనియర్ నటి దేవయాని ప్రధాన పాత్రలో నటించగా, విజిత్ హీరోగా నటించారు. ఇతర పాత్రల్లో ఇళవరసు, రాజ్‌కపూర్ మనోజ్ కుమార్, వడివుక్కరసి, నీలిమా ఇసై, బేబీ నిహారిక, బేబీ అహానా ఇతర పాత్రల్లో నటించారు. మే 9వ తేదీ విడుదలకానున్న ఈ చిత్రాన్ని తమిళనాడు, పుదుచ్చేరిలో బ్లాక్‌బస్టర్ ప్రొడక్షన్ రిలీజ్ చేయనుంది. ఈ నేపథ్యంలో చిత్రం ఆడియో, ట్రైలర్‌ను గురువారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకకు సినీ దర్శకులు కె.భాగ్యరాజ్, సీమాన్, పేరరసు, ఆర్‌కే సెల్వమణి, సీనియర్ నటి వనిత, హీరోయిన్ దేవయాని, చిత్ర బృందం సభ్యులు హాజరయ్యారు. సీనియర్ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, ప్రతిభావంతుడైన వ్యక్తికి కేజీ జ్ఞానం ఉన్నప్పటికీ 10 గ్రాముల అదృష్టవంతుడు వద్ద చేతులు కట్టుకుని నిల్చోవాల్సిందేనన్నారు. నామ్ తమిళర్ కట్చి కన్వీనర్, సినీ దర్శకుడు సిమాన్ మాట్లాడుతూ, సోమరిపోతులు కూడా సూపర్‌స్టార్ రజనీకాంత్ నటనను చూస్తే ఉత్సాహవంతులుగా మారిపోతారన్నారు. మరో దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, పిల్లాడిని పెరిగేలా చేయడం వేరు.. పిల్లాడిని పెంచడం వేరని గుర్తు చేశారు. 'వెండితెర దేవసేన దేవయాని' అని నటి వనిత ప్రశంసించారు. అలాగే, ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించిన నటి దేవయానితో పాటు చిత్ర దర్శక నిర్మాతలు, ఇతర నటీనటులు తమతమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అజిత్ - షాలిని వివాహ బంధానికి పాతికేళ్ళు



చిత్రజ్యోతి

కోలీవుడ్ అగ్రహీరో అజిత్ కుమార్, ఆయన సతీమణి షాలిని దంపతులకు వివాహమై 25 యేళ్ళు పూర్తయ్యాయి. ఈ శుభ సందర్భంగా వారు కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బెల్జియం కార్ రేసింగ్ పూర్తి చేసుకుని గురువారం నగరానికి చేరుకున్న అజిత్... తమ 25వ వార్షిక వివాహ వేడుకను భార్యతో కలిసి జరుపుకున్నారు. ఈ దంపతులిద్దరూ కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ వీడియోను అజిత్ ఫ్యాన్స్ అమితంగా లైక్ చేస్తూ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అయింది. కాగా, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీ ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.

వైజీ మహేంద్రన్ ప్రధాన పాత్రలో 'డార్క్ ఫేస్'

సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ ప్రధాన పాత్రలో 'డార్క్‌ఫేస్' అనే పేరుతో సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఒక వెబ్ సిరీస్ తెరకెక్కింది. దీని ఫస్ట్‌లుక్ రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. దిచూజన్ వన్ పతాకంపై అబు కరీం ఇస్మాయిల్ నిర్మించగా, దాదాపు పదికి పైగా చిత్రాలకు సంగీతం సమకూర్చి, అనేక మ్యూజిక్ ఆల్బమ్‌లను తయారు చేసిన చరణ్ ప్రకాష్ ఈ వెబ్‌సిరీస్ ద్వారా తొలిసారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇందులో వైజీ మహేంద్రన్ సీనియర్ న్యాయవాదిగా నటించారు. ఈయన కుమార్తె వైజీ మదువంతి ఉమెన్స్ హాస్టల్ వార్డెన్‌గా నటించారు. వీరితో పాటు విజయ్ టీవీ కేపీవై రాజవేల్, సౌమ్య, నిర్మాత అబు కరీం ఇస్మాయిల్, శక్తి, సునీల్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. సీనియర్ దర్శకుడు ఎన్.లింగుస్వామి ఈ కార్యక్రమానికి హాజరై ఈ వెబ్ సిరీస్ టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. తొలుత వైజీ మహేంద్రన్ మాట్లాడుతూ, 'వెబ్ సిరీస్ అనేది ఐపీఎల్ క్రికెట్ వంటిది. భారత క్రికెట్ జట్టులో చోటు లభిస్తుందని కలలో కూడా ఊహించిన వర్ధమాన క్రికెటర్లకు, జాతీయ జట్టులో చోటు దక్కేలా అవకాశాలు ఐపీఎల్ క్రికెట్ కల్పిస్తుంది. వెబ్ సిరీస్‌ల ద్వారా అనేక మంది దర్శకులు తమ ప్రతిభను నిరూపించుకుని సినిమాలకు దర్శకత్వం వహించే అవకాశాన్ని పొందుతున్నారు. చరణ్ ప్రకాష్ కూడా ఆ స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఎన్.లింగుస్వామి మాట్లాడుతూ, 'వైజీ మహేంద్రన్‌తో కలిసి పనిచేయకపోయినా ఆయనంటే నాకు ఎంతో ఇష్టం. రజనీ, కమల్, శివాజీ వంటి గొప్ప నటీనటులతో కలిసి నటించినా, పెద్ద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ నటన ఆయన రక్తంలో ఇమిడిపోయింది. 'మానాడు' వంటి చిత్రాల్లో ఆయన నటన అద్భుతంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ కూడా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. దర్శకుడు చరణ్ ప్రకాష్ మాట్లాడుతూ, 'ఒక వ్యక్తిని అత్యాచార కేసులో అరెస్టు చేస్తారు. ఆయన అత్యాచారం చేసినట్టుగా భావించే మహిళ ఆత్మహత్య చేసుకుంటుంది. బాధిత మహిళ తరపున కోర్టులో వాదించి, దోషులకు శిక్షపడేలా చేసే న్యాయవాది పాత్రలో వైజీ మహేంద్రన్ నటిస్తున్నారు. ఈ వెబ్‌సిరీస్‌కు ఆయన పాత్రే అత్యంత కీలకం' అన్నారు.



'డార్క్‌ఫేస్' ఫస్ట్‌లుక్ రిలీజ్



వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్ నుంచి స్వర్ణపతకాలు అందుకుంటున్న డాక్టర్ ఎ.సంజన

రోగుల సంరక్షణతోపాటు దేశ సంక్షేమానికి పాటుపడాలి!

● ఆర్మీ సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్



స్వర్ణపతకం సాధించిన నిదర్శన పాండ్యన్‌కు సర్టిఫికెట్ ప్రదానం

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సుల్లో పట్టాలందుకున్న యువతీయువకులు రోగుల సంరక్షణకే పరిమితం కాకుండా దేశ సంక్షేమానికి తమ వంతు సహాయసహకారాలు అందించాలని ఢిల్లీలోని సైనిక దళాల వైద్య సేవల డైరెక్టర్ జనరల్ సర్జన్, వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్ పిలుపునిచ్చారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని కృతిమమేథోపరిజ్ఞానం (ఏఐ) రోబోటిక్ సర్జరీల ప్రాధాన్యత పెరిగాయని, ఈ మార్పులను యువపట్టభద్రులు తమకు అందివచ్చిన అవకాశాలుగా భావించి రోగులకు మానవతావాదం, నైతిక విలువలతో వైద్య సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. త్రివిధ దళాల్లో వైద్య సేవలందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోరూరులోని శ్రీరామచంద్ర ఉన్నతవిద్యా పరిశోధనా సంస్థలో శుక్రవారం నిర్వహించిన 39వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ సందేశమిచ్చారు. ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం, ప్రో ఛాన్సలర్ ఆర్వీ సెంగుట్టువన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమాశంకర్ సమక్షంలో వైద్య పట్టాలు అందుకున్నవారిలో 29 మంది విద్యార్థులకు 40 బంగారు పతకాలను ఆమె అందజేశారు. వీరిలో డాక్టర్ వి.సంజన 5 స్వర్ణ పతకాలు అందుకుని ఛాన్సలర్ వెంకటాచలం, వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్ ప్రశంసలందుకుంది. ఈ స్నాతకోత్సవంలో 637 మందికి యూజీ, పీజీ డిగ్రీలు, పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. యూజీసీ ప్రతినిధి డాక్టర్ కేఆర్ రమేష్, వైద్యకళాశాల డీన్ డాక్టర్ కే బాలాజీ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సెంథిల్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జ్యోతిమలర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ జే రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యరాజ్‌కు పెరియార్ జ్యోతి అవార్డు



చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డీపీఐ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు సత్యరాజ్‌కు పెరియార్ జ్యోతి అవార్డు అందజేయనున్నట్లు ఆ పార్టీ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ పేర్కొన్నారు. పార్టీ తరఫున వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించే ప్రముఖులకు ప్రతియేటా అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. ఆ మేరకు 2025 సంవత్సరానికి గాను అవార్డులందుకోనున్నవారి జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. పెరియార్ జ్యోతి అవార్డు సత్యరాజ్‌కు, అంబేడ్కర్ జ్యోతి అవార్డు పెరియార్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కేఎస్ చలంకు, మార్క్స్ మామణి అవార్డు తమిళ దేశీయ విడుదల ఇయక్కమ్ ప్రధాన కార్యదర్శి త్యాగుకు, కామరాజర్ జ్యోతి అవార్డును పుదుచ్చేరి మాజీ సీఎం వి.వైద్యలింగంకు, అయోధ్య దాసర్ ఆదవన్ అవార్డును పి.జంబులింగంకు, కాయిదేమిల్లత్ నెలవంక అవార్డును పీప ఖాజామొయినుద్దీన్ భార్గవి, సెమ్మొళి జ్ఞాయిర్ అవార్డును ఎ.షణ్ముగనాథన్‌కు ప్రదానం చేయనున్నారు.



● ప్రముఖ కళాకారిణి శాంతలా సుబ్రమణ్యం

గాత్ర సంగీతంలో ప్రావీణ్యం... వేణు గానంలో నైపుణ్యం

తరుణి

సంగీతానికి ఎల్లలులేవు. శాస్త్రీయ సంగీతమైనా, పాశ్చాత్యమైనా అది అందించే ఆనందం అనిర్వచనీయం. కొందరు గాత్రసంగీతంలో రాణిస్తే.. మరికొందరు వాద్యసంగీత కళాకారులుగా రాణిస్తుంటారు. గాత్ర,వాద్య సంగీతాలు రెండింటిలోనూ సమప్రతిభ కలవారు అరుదుగానే ఉంటారు. అలాంటివారిలో శాంతలా సుబ్రమణ్యం ఒకరు. వేణుగానం, గాత్రసంగీతంలో ఆమె ప్రతిభాపాటవాలపై ఈ నాటి 'తరుణి'లో...

- వేళచ్చేరి,ఆంధ్రజ్యోతి

వేణువాదనలో...

శాంతల జన్మించింది బెంగళూరులో. తల్లి హేమలత గృహిణి. తండ్రి సుబ్రమణ్యం బెంగళూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. వృత్తి బోధన అయితే ఆయన ప్రవృత్తి సంగీతం. వేణుగానంలో నైపుణ్యం ఉంది.. శాంతలకు ఒక సోదరుడు.

సంగీత ప్రయాణం సాగిందిలా...

పుట్టినప్పటి నుండి తల్లి పాటలు, తండ్రి ఫ్లూటు వింటూ పెరిగిన శాంతలకు సహజంగానే సంగీతంపై మక్కువ పెరిగింది. కుశాగ్ర బుద్ధి కలిగిన శాంతల రెండేళ్ళ వయసులోనే రాగాలను గుర్తించే ప్రజ్ఞ సాధించి,. పాటకు స్వరంకూర్చగల జ్ఞానం సొంతం చేసుకునాన్రు. బాల్యంలోనే సంగీత తృష్ణ బీజరూపం దాల్చింది. దానికి తోడు సోదరుడు కూడా ఫ్లూట్ వాయించడం ఆమెలో, సంగీత స్ఫూర్తిని ద్విగుణీకృతం చేసింది. శాంతల తండ్రి, పిల్లలకు సంగీతంపై ఉన్న ఆసక్తిని గమనించారు. సంగీత సంస్కృతికి పట్టుగొమ్మ అయిన చెన్నై తన పిల్లలను సంగీత కళాకారులుగా తీర్చిదిద్దగలదని భావించి, బెంగళూరులోని ఉద్యోగానికి స్వస్తిపలికి కుటుంబం సహా చెన్నై చేరారు శాంతల తండ్రి. సంగీతంలో శాంతలకు ప్రథమ గురువు తండ్రి. ఆయన ప్రోత్సాహం, గురువుల శిక్షణ శాంతలను సంగీత కళాకారిణిగా మలిచాయి.

తండ్రి, సోదరుడు ఫ్లూట్ వాయించడం చిన్నతనం నుండి గమనించి స్వయంగా వేణు గానంపై నేర్పు సాధించింది శాంతల. శాస్త్రీయ గాత్రసంగీతంలో ఇప్పటికీ శిక్షణ పొందుతున్నారు.

గాత్ర, వాయిద్య సంగీతాలు వృత్తిగా...

శాంతల శాస్త్రీయ సంగీతంలో ఎంతోమందికి శిక్షణ ఇస్తున్నారు. కొంతమంది విద్యార్థులకు గాత్రం, మరి కొంత మందికి ఫ్లూట్ శిక్షణ ఇంటిలోను, ఆన్‌లైన్‌లో ఇస్తున్నారు.. విదేశీ విద్యార్థులు కూడా ఆమె దగ్గర ఫ్లూట్ నేర్చుకోవడం విశేషం. శాంతల ఆల్ ఇండియా రేడియో చెన్నై కేంద్రంలో బి.హెచ్ గ్రేడ్ ఆర్టిస్టుగా ఉన్నారు.

కచేరీలు.... : చెన్నైలోని శారద గాన సభ, భారతీయ విద్యాభవన్, కార్తీక్ ఫైన్ ఆర్ట్స్ ముద్ర తదితర సంగీత సభల్లో గాత్ర, వాద్య సంగీత కచేరీలు చేశారు. 30 దేశాల్లో తన వాద్య సంగీత ప్రతిభతో శ్రోతలను అలరించారు. అంతేకాదు! కొన్ని విదేశీ ప్రాంతాల్లో మన సంగీత మాధుర్యాన్ని రుచి చూపించిన ప్రథమ మహిళ తనే అనే విషయం శాంతల తెలిపారు.

దేశ, విదేశాల్లో గాత్ర, వాద్య కచేరీలతో పాటు లెక్చర్లు, డిమాన్‌స్ట్రేషన్లు కూడా ఇస్తుంటారు శాంతల. విదేశీ విద్యార్థులు ఎంతోమంది తన వాద్యసంగీతాలతో ప్రేరణ పొందారన్నారు శాంతల. దేశ,విదేశాలలో ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు ఆమె. విదేశీ విశ్వవిద్యాలయాలలో రాగతాళస్వరూప స్వభావాలు, రాగాలాపన, స్వర కల్పన వంటి అంశాలపై ఉపన్యాసాలు, డిమాన్‌స్ట్రేషన్స్ ద్వారా ఆమె తెలియజేస్తుంటారు.

ఫ్లూట్ వాయిద్యం-మహిళలు....

ఫ్లూట్ నేర్చుకొనే మహిళల సంఖ్య తక్కువగా ఉందని చెబుతూ దానికి గల కారణాలను ఇలా వివరించారు శాంతల. " ఫ్లూట్ వాయించడం మహిళలకు కొద్దిగా కష్టమైనపనే. అయినా ఇష్టం, ఆసక్తి ఉంటే అధిగమించవచ్చు. ముఖ్యంగా సహనం, ఓపిక, అంకితభావం కావాలి. ఒక సంవత్సరంలోనే నైపుణ్యం రావాలంటే సాధ్యంకాదు. సాధన ఎంతో అవసరం".

అభిరుచులు... : శాంతలకు పర్యటనలు, ముఖ్యంగా చారిత్రకాత్మకమైన స్థలాలు, శిల్పసౌందర్యం ఉట్టిపడే దేవాలయాలు సందర్శించడం పట్ల ఆసక్తి ఎక్కువ.

"సంగీత ద్వారా సానుకూల దృక్పథం పెంపొందుతుంది. అనేక రుగ్మతలను సంగీతం దూరం చేస్తుంది. స్వీయ ఆనందం కోసం పాడుకుంటే సంతోషం సొంతమవుతుంది. సంగీతాన్ని దైవంగా భావిస్తే ఆత్మానందంతో పాటు పరమార్థం సిద్ధిస్తుంది. సంగీతానికి దైవదత్తమైన శక్తులున్నాయి. అరి శాంతల తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

విద్యాభ్యాసం...

శాంతల బెంగళూరులో పాఠశాల విద్యకు నాందిపలికినా అది కొనసాగింది చెన్నైలోనే. చెన్నైలోని శివస్వామి కళాలయంలో 12వ తరగతి వరకు చదివిన శాంతల దూరవిద్య ద్వారా బీఎస్సీ పట్టా పొందారు.

కుటుంబ నేపథ్యం...



శాంతల భర్త రాంజీ. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆరేళ్ల కుమారుడు మృదంగం నేర్చుకుంటున్నాడు. తన భర్త ప్రోత్సాహం, అత్తమామలు, తల్లిదండ్రుల సహాయ సహకారాల వల్లనే తన సంగీత ప్రస్థానం సజావుగా సాగుతున్నదని శాంతల అన్నారు.



శాంతలా సుబ్రమణ్యం



తల్లిదండ్రులతో...

రంగనాథుడి రథోత్సవానికి ఆండాళ్ వస్త్రాల సమర్పణ



ఆండాళ్ శూడికొడుత్త పట్టువస్త్రాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

టి.నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం రంగనాథస్వామి చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న మహారథోత్సవంలో నంబెరుమాళ్ ధరించేందుకు శ్రీవిల్లిపుత్తూరు నుంచి ఆండాళ్ ధరించిన పట్టువస్త్రం, చిలుక సహా మంగళప్రదమైన వస్తువులను శ్రీరంగం క్షేత్రానికి తరలించే కార్యక్రమం జరిగింది. శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయ అర్చకులు, అధికారులు మంగళ వాయిద్యాలు, మంత్రోచ్ఛారణ నడుమ అమ్మవారి పట్టువస్త్రం మంగళ ప్రదమైన వస్తువులతో ఆలయ మాడవీధులలో ఊరేగారు. ఆ తర్వాత ప్రత్యేక వాహనంలో ఆ వస్తువులను శ్రీరంగం క్షేత్రానికి పంపారు. అష్టోత్తర శత వైష్ణవదివ్యదేశాల్లో ప్రఖ్యాతిగడించిన శ్రీవిల్లిపుత్తూరులో పెరియాళ్వార్ కుమార్తెగా అవతరించిన ఆండాళ్ ఆ నంబెరుమాళ్ సతీమణిగా భావించి మార్గశిర మాసంలో కాత్యాయని వ్రతమాచరించి ఆ రంగనాథస్వామినే పరిణయమాడింది. ఆండాళ్ అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల పెరుమాళ్లనే మాలలుగా ధరించి ఉందనేది ఐతిహ్యం. ఆ విషయాన్ని తెలిపే ఆండాళ్ సన్నిధి అంతర ప్రాకారంలో 108 దివ్యదేశాలకు చెందిన పెరుమాళ్ళ చిత్రలేఖనాలు కనిపిస్తాయి. ఇక తిరుమల బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ రోజున మల్లయప్పస్వామి, మదురై చిత్తిరై వేడుకల్లో వైగై నదిలో అశ్వరూఢులై దిగే కళ్ళలగర్‌స్వామి, శ్రీరంగం ఆలయ చిత్తిరై రథోత్సవం రోజు నంబెరుమాళ్ తదితరులు ఆండాళ్ శూడికొడుత్త పుష్పమాలలు, పట్టు వస్త్రాలు ధరించడం ఆనవాయితీ. ఆ ప్రకారమే శ్రీరంగం క్షేత్రంలో శనివారం జరుగనున్న మహారథోత్సవంలో స్వామివారికి అలంకరించేందుకు శ్రీవిల్లిపుత్తూరు నుండి ఆండాళ్ శూడికొడుత్త పట్టువస్త్రం, పుష్పమాల, చిలుక తదితర వస్తువులను ఆలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. అంతకు ముందు చిత్తిరై ఏకాదశిని పురస్కరించుకుని అద్దాల మండపంలో వేంచేసిన ఆండాళ్, రంగమన్నార్‌కు చిలుక, పట్టు వస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆండాళ్ శూడికొడుత్త పట్టువస్త్రం, చిలుక తదితర వస్తువులను మాడవీధులలో ఊరేగించి శ్రీరంగం క్షేత్రానికి పంపారు. ఈ వేడుకలలో ఆలయ కార్యనిర్వహణాధికారి సర్కరైయమ్మాళ్, మణియం గోపి, సుదర్శనభట్టర్, రమేష్‌భట్టర్ తదితరులు పాల్గొన్నారు.



అద్దాల మండపంలో పట్టువస్త్రాలను, చిలుకను ధరించిన ఆండాళ్, రంగమన్నార్



సదస్సులో పారిశ్రామిక వేత్తలు

దేశ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య వాహన పరిశ్రమ కీలక పాత్ర

అడయార్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వృద్ధిలో భారతీయ వాణిజ్య వాహన పరిశ్రమ కీలక భూమిక పోషిస్తుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సదరన్ రీజియన్ వాణిజ్య వాహన సదస్సులో టాటా మోటర్స్ ప్రెసిడెంట్ రాజేంద్ర పట్కేర్ అభిప్రాయపడ్డారు. నగరంలో జరిగిన సీఐఐ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'భారతదేశ వాణిజ్య వాహన పరిశ్రమ ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొని నిలబడిందన్నారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తోందని, ఇందులో వాణిజ్య వాహన పరిశ్రమ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు.


రూ.200కే హైస్పీడ్ ఇంటర్నెట్

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్

పెరంబూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు కేబుల్ టీవీ సేవలు అందిస్తున్నట్లు, 100 ఎంబీపీఎస్ వేగంతో నెలకు రూ.200 ఛార్జీతో ఇంటర్నెట్ సేవలు అందించనున్నట్లు మంత్రి పళనివేల్ త్యాగరాజన్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో శుక్రవారం సంచార సాంకేతిక శాఖ, పరిశ్రమల శాఖ పద్దుపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... ఈ పథకంలో తొలివిడతగా ఇప్పటివరకు రెండువేల ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించామన్నారు. 4,700 గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఇంటర్నెట్ కల్పించాలని దరఖాస్తులందాయని తెలిపారు. గత ఏడాది ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా ఈ-సేవా కేంద్రాల ద్వారా రూ.1.2 కోట్ల మంది లబ్ధిపొందారన్నారు. డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత 25వేల ఈ-సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.



బుధవారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,227

తలనీలాలు సమర్పించినవారు: 28,951









- మిశ్రమ పంటలతో నిరంతర ఆదాయం
- సేంద్రియ పద్ధతుల్లో వినూత్న సాగు

ఏటీఎం సాగుతో ఏడాదంతా సిరులు



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎనీటైం మనీ(ఏటీఎం) సాగు..ఇదేంటని విస్తుపోతున్నారా.. జిల్లాలో కొందరు రైతుల ఇప్పుడు ఇదే బాట పట్టారు. రోజూ నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. వ్యవసాయమంటే నష్టాలతో కూడుకున్నదని పెదవి విరిచేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలానుగుణ మార్పులను అన్వయించుకుంటూ సాగును కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో అంతర్‌పంటల సాగునే రైతులు,ప్రకృతి వ్యవసాయాధికారులు ఏటీఎంగా వ్యవహరి స్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, పొద్దుతిరుగుడు, జామ తదితర పంటలను మిశ్రమంగా సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. నిరంతరం కొద్దోగొప్పో ఆర్జించగలుగుతున్నారు. జిల్లాలో 70శాతం మంది మహిళా రైతులు ఏటీఎం తరహాలోనే సేంద్రియ ఎరువుతో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుండటంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. గత యేడాది 43,646 మంది ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేశారు. అందులో 20 రకాల మిశ్రమ పంటలు వేశారు. ఏడాదంతా ఆదాయం వచ్చే వంగ, టమోటా, మిరప,గోరుచిక్కుడు, బీర, కాకర,ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ వంటి పంటల సాగుతో ఆదాయం పొందుతున్నారు.

రెట్టింపు ఆదాయం



పదవ తరగతి వరకు చదివాను. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ. మా ఆయన సహకారంతో, వ్యవసాయాధికారుల సూచనలతో కొత్తకొత్త పద్ధతులు నేర్చుకుంటున్నాను. నిమ్మలో అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. పొలం చుట్టూపై కంచెపై తీగజాతి కాకర, బీర, దోసకాయలను పండిస్తున్నాను. ఆకుకూరలు, కాయగూరలతో నిరంతరం ఆదాయం వస్తోంది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. ఏటీఎం సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసంధానం చేయడంతో ఏటా సుమారు రూ.1.50లక్షల ఆదాయం వస్తోంది. కొంతమేర అప్పులు తీర్చాము. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలను ఇళ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

-కొడవలూరు మహేశ్వరి, ఆర్మేన్‌పాడు, ఓజిలి మండలం

ఏడాదిపొడవునా సాగు



ఇంటర్ చదువుకున్నాను. చదువుకుంటూనే పొలం పనుల్లో సాయం చేసేదాన్ని. వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ. క్రిమిసంహారక మందులతో ఖర్చు పెరిగి తక్కువ ఆదాయం వస్తుందని గుర్తించాను. సేంద్రియ పద్ధతులను అవలంభిస్తున్నాను. ఖర్చు తగ్గింది. ఆదాయం పెరిగింది. వ్యవసాయాధికారుల సూచనతో ఏడాదంతా ఆదాయం(ఏటీఎం)అర్జించేలా 20 రకాల అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. గతంలో ఎకరాకు రూ.26వేలు ఖర్చయ్యేది. ప్రకృతి వ్యవసాయంలో రూ.19వేలు మాత్రమే ఖర్చవుతోంది. అంతర్ పంటల సాగుతో ఏడాదంతా ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ ఆకుకూరలు, కూరగాయలకు డిమాండ్ ఏర్పడంతో ఊళ్లోనే అమ్ముడుపోతున్నాయి.

- దొండపాటి హేమలత, పాండురంగావారిపల్లె, చంద్రగిరి మండలం

రోజూ డబ్బులు కళ్లజూస్తున్నాం

గతంలో వ్యవసాయం చేస్తే ఖర్చులు పెరిగి అప్పులే మిగిలేవి. దీంతో కొందరు రైతులను స్ఫూర్తిగా తీసుకున్నాను. వారి తరహాలోనే రెండు ఎకరాల పొలంలో సేంద్రియ పద్ధతిలో అంతర్ పంటలు వేశాను.



ఆదాయం పెరిగింది. మిశ్రమ పంటల సాగుతో ఏడాదికి రూ.1.48 లక్షలు ఆదాయం వస్తోంది. మామిడిలోనే అంతర పంటలను సాగు చేస్తున్నాను. నా భూమిని రసాయనరహితంగా మార్చుకున్నాను. ఇప్పుడు బాగా దిగుబడి పెరిగింది.

- కె.రాజగోపాల్‌నాయుడు, శేషాపురం, చంద్రగిరి మండలం



ఆదాయంతోపాటు ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏటీఎం మోడల్స్‌తో నిరంతరం ఆదాయం తెచ్చే అంతరపంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. తరచూ ఆదాయం రావడంతో రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి పద్ధతులను అనుసరించేలా సూచనలిస్తున్నాం. ఈసేద్యం వల్ల రైతాంగానికి ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యానికి దోహదపడే వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాద్‌రావుల ప్రోత్సాహంతో ఈ యేడాది 72,392ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు చేపడుతున్నాం. గత యేడాది 43,646ఎకరాల్లో సాగయ్యింది.

- షణ్ముగం, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

ప్రవాసాంధ్రుల శ్రీవారి సేవకు ఏర్పాట్లు చేయండి

● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రులు శ్రీవారి సేవ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి సేవ చేసేందుకు వచ్చే భకులకు మరింత మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. మెడికల్, విద్య, ఇంజనీరింగ్, ఐటీ, క్యాటరింగ్, కల్చరల్, గోసేవ తదితర రంగాల నుంచి నిపుణులను ఇందులో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. మెడిటేషన్, యోగా, నైపుణ్యాభివృద్ధి, వైద్య సేవలు, సామర్థ్యాల పెంపు, అభిప్రాయ సేకరణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీవారి మహత్యం, తిరుమల ప్రాముఖ్యత, శ్రీవారి సేవ విధి, విధానాలు, సేవా నిరతి గురించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డీన్ అల్లాడి మోహన్, జీఎం ట్రాన్స్‌పోర్ట్ శేషారెడ్డి, అన్నదానం ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, డిప్యూటీ ఈవో రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

8మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

● 12 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 12 ఎర్రచందనం దుంగలతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం స్థానిక ఎఫ్‌బీవో అనిల్‌కుమార్‌తో కలిసి గురువారం నుంచి వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారు. పోలీసులను గమనించిన పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టి 8మందిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు.

తేనాంపేట మైదానంలో 30 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ బహిరంగ సభ

చెన్నై, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట మైదానంలో మూడు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ మే 4న జరుగనుందని టీఎన్‌సీసీ నిర్వాహకులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ దేశవ్యాప్తంగా విరాళాలు సేకరించి తేనాంపేట మైదానాన్ని పార్టీ కోసం కొనుగోలు చేశారు. ఆ మైదానంలో తరచూ కాంగ్రెస్ మహాసభలు జరుగుతుండేవి. ఈ మైదానంలోనే కాంగ్రెస్ శతవార్షికోత్సవాలు జరిగాయి. ఆ వేడుకల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, నటుడు శివాజీగణేశన్, కాంగ్రెస్ దిగ్గజం మూప్పనార్ వంటి నాయకులు పాల్గొన్నారు. మూడు దశాబ్దాల క్రితం తేనాంపేట అని పేరు చెప్పగానే అందరికీ కాంగ్రెస్ మైదానమే గుర్తుకు వచ్చేది. ఈ మైదానంలో 20 గ్రౌండ్ల స్థలంలో కామరాజర్ అరంగం నిర్మించారు. మిగతా 180 గ్రౌండ్ల విస్తీర్ణం కలిగిన మైదానంలో 24 అంతస్థులతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలనుకున్నారు. అయితే వివిధ కారణాల వల్ల ఆ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయింది. ఈ పరిస్థితులలో 30 యేళ్ల తర్వాత ప్రస్తుతం కామరాజర్ అరంగం చేరువగా ఉన్న మైదానంలో కాంగ్రెస్ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 4న జరిగే సభలో కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, కొంత మంది జాతీయ నాయకులు పాల్గొనున్నారు. తేనాంపేట కాంగ్రెస్ మైదానంలో సభ నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేపడుతున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● లెదర్ ఎక్స్‌పోర్ట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సెల్వం



కీలకోపన్యాసం చేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెల్వం

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని లెదర్ ఎక్స్‌పోర్ట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సెల్వం అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్, నెదర్లాండుకు చెందిన ఎఫ్ఎస్ఎస్‌సీ అనే సర్టిఫికేషన్ సంస్థల సహకారంతో 'బిల్డింగ్ గ్లోబల్ ట్రస్ట్ విత్ ఏ సోషల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ స్టాండర్డ్' అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. తేనాంపేటలోని హయాత్ రీజెన్సీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ సదస్సుకు ఏసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.నరసింహన్ స్వాగతం పలికారు. ఇందులో ముఖ్యఅతిథిగా లెదర్ ఎక్స్‌పోర్ట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సెల్వం, గౌరవ అతిథులుగా ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ రూప్ రషి, కార్యదర్శి కార్తికేయ హాజరయ్యారు. నెదర్లాండ్‌కు చెందిన ఎఫ్ఎస్ఎస్‌సీ మార్కెట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కాలిన్ మార్గాన్, ఏసీసీ కమిటీ ఆన్ స్టాండర్డ్స్ సర్టిఫికేషన్స్, రెగ్యులేషన్స్ చైర్‌పర్సన్ రామవేణుగోపాల్ ఎఫ్ఎస్ఎస్‌సీ భారత ప్రతినిధి స్మితా మూర్తి, నెదర్లాండ్ ప్రతినిధి యాంటీ బాటినిక్, ఎన్ఏబీసీబీ సీఈవో రాజేష్ మహేశ్వరి తదితరులు పాల్గొని ఉత్పత్తి రంగానికి సంబంధించిన మెళుకువలు, నాణ్యత తదితర అంశాలపై సూచనలిచ్చారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మభూషన్ డాక్టర్ నల్లి కుప్పుస్వామి చెట్టి పాల్గొని వ్యాపార రంగంలో తాను సాధించిన విజయాల గురించి వివరించారు

ఆకట్టుకుంటున్న మినీ స్కేల్ మోడల్ ట్రైన్ షో

ప్యారీస్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కం సమీపంలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) రైలు మ్యూజియంలో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన మినీ స్కేల్ మోడల్ ట్రైన్ షో అందరినీ ఆకట్టుకుంటోంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించిన ఈ షో ఆదివారం వరకు కొనసాగనుంది. భారత రైల్వే ఆధ్వర్యంలో దేశంలో అందుబాటులో వున్న పలు రైళ్ల నమూనాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు తొలిరోజు ప్రదర్శన ఆసక్తిగా వీక్షించారు. ఐసీఎఫ్ జంక్షన్ సమీపంలో న్యూ ఆవడి రోడ్డులోవున్న ఐసీఎఫ్ ఫర్నిషింగ్ డివిజన్ ప్రాంగణంలోని చెన్నై రైలు మ్యూజియంలో ఈ ప్రదర్శనను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వీక్షించవచ్చని పీఆర్వో ఎంజీ శంకర్ తెలిపారు.







చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నమూనాను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థినులు - రైల్వే ట్రాక్, సిగ్నల్ వ్యవస్థలపై ప్రదర్శనలో ఏర్పాటు చేసిన నమూనాలు